సాక్షి
పెద్దపల్లి
బుధవారం : 6 : సెప్టెంబర్ : 2023



వర్షాలతో పంటలకు మేలు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేస్తున్నాయి. ముఖ్యంగా ఇసుక నేలల్లో పంటలకు జీవం వచ్చింది. 8లో▸



బొగ్గు రవాణా వేగం పెంచాలి

సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును వెంటవెంటనే రవాణా చేయాలని సంస్థ డైరెక్టర్లు అధికారులకు సూచించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /21.0

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. కొన్నిచోట్ల పిడుగులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎల్లంపల్లికి 3,27,706 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ నుంచి సుమారు 3,27,706 క్యూసెక్కుల నీరు వస్తోంది. 30 గేట్లు ఎత్తి 3,43,151 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 18.730 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

- సమస్యలంటే 7995070699కు సమాచారమివ్వండి..
- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

పెద్దపల్లిరూరల్: వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ జీవీ.శ్యాం ప్రసాద్ లాల్ తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో జిల్లాయంత్రాంగం అప్రమత్తమైందన్నారు. ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే 79950 70699 నంబర్‌కు ఫోన్‌చేసిసమాచారం అందించాలని తెలిపారు.
కోల్‌సిటీ: కార్పొరేషన్‌లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వర్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో సహాయం అవసరమైన వారు టోల్‌ఫ్రీ నంబర్ 18004 257062, 96036 66444, 93924 83959 కంట్రోల్‌రూంను సంప్రదించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని కోరారు.

నేడు ఆదివరాహస్వామి ఆలయ హుండీ లెక్కింపు



ఆదివరాహస్వామి ఆలయం

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కాంత రెడ్డి తెలిపారు. ఆసక్తి గల భక్తులు పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, పాఠశాలల్లో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. స్వీప్ ఆక్టివిటీస్ నిర్వహణపై వివరించారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 55 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా.. 22 మందికి సర్టిఫికెట్లు ఉన్నాయని తెలిపారు. డీఈవో డి.మాధవి, స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

ధర్మారం: ఓసీల సమస్యలను పరిష్కరిస్తామని అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఆరుకోట్లకుపైగా నిరుపేద ఓసీలు ఉన్నారని, వారిని ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు. అగ్రవర్ణాల్లోని పేదలకు పదిశాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుచేయటం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. గడ్డం కొమురెల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి



పెద్దపల్లిరూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అసెంబ్లీలో సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం నాయకుడు పూసాల రమేశ్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్లు మంగళవారం డీఈఓ మాధవిని కలిసి సమస్యల పరిష్కారానికి విన్నవించారు. ఈనెల 20లోపు పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేకుంటే సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు.

సింహం, ఏనుగులే ప్రత్యామ్నాయం!



- రాబోయే ఎన్నికలపై ఏఐఎఫ్‌బీ, బీఎస్పీ గంపెడాశలు
- మళ్లీ సత్తా చాటేందుకు ఏఐఎఫ్‌బీ ఉత్సాహం
- స్థానిక సంస్థల్లో సింహం గుర్తుపై 24 మంది విజయం
- 2018లో రామగుండంలో ఎమ్మెల్యే సీటు కైవసం
- ఉమ్మడి జిల్లాలో బోణీ కొట్టేందుకు బీఎస్పీ ఆరాటం
- రెండుపార్టీలతో టచ్‌లో ఉంటున్న అసంతృప్తులు
- బీజేపీ, కాంగ్రెస్ జాబితాల తర్వాత మరికొంత మంది వస్తారని అంచనా



సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. గులాబీ పార్టీ ఇప్పటికే తన అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ జాబితాపై కసరత్తు ప్రారంభించింది. బీజేపీ కూడా ఎమ్మెల్యే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టింది. ఈ నెలాఖరు వరకు కాంగ్రెస్, బీజేపీల జాబితాపై స్పష్టత రానుంది. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలువురు అసంతృప్తులు ఎలాగైనా ఎమ్మెల్యే బరిలో నిలిచేందుకు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు త్వరలోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కూడా జాబితా వెల్లడయ్యాక.. అసంతృప్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వీరంతా తమ పార్టీ, అధికార పార్టీ కాకుండా మరో ప్రత్యామ్నాయ వేదిక నుంచి పోటీ చేసేందుకు సై అంటారనడంలో సందేహం లేదు. ఈ క్రమంలో వీరికి రాజకీయంగా రెండు వేదికలు అందుబాటులో ఉంటాయి. అవి ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) కాగా, బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ). ఈ రెండు పార్టీలు జిల్లాలో చాలాకాలంగా తమ ఉనికి చాటుకుంటున్నాయి. రెండు పార్టీలకు బలమైన క్రియాశీలక నేతలు లేకపోయినా, అసంతృప్తులను అప్పటికపుడు అక్కున చేర్చుకునే రాజకీయ వేదికలుగా మారాయి.

సెంటిమెంట్‌కు మారుపేరుగా..

ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) గతంలో నామమాత్రంగా ఎన్నికల సమయంలో మాత్రమే తెరపైకి వచ్చేది. కానీ, 2018లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) గుర్తు సింహం సింబల్‌పై గెలుపొందడంతో ఈ పార్టీ పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగింది. అప్పట్లో కోరుకంటి చందర్ విజయం ఒక సంచలనం. చందర్ గెలిచిన తరువాత ఉమ్మడి జిల్లాలో సింహం గుర్తు సానుభూతికి మారుపేరుగా మారిపోయింది. అధికార – ప్రతిపక్ష పార్టీలో టికెట్ ఆశించి భంగపడ్డ వారంతా క్రమంగా ఏఐఎఫ్‌బీలో చేరడం, సింహం గుర్తుపై పోటీ చేయడం ఆనవాయితీగా మారింది. ఈ పార్టీగుర్తుపై పోటీ చేసిన వారిలో విజయశాతం కూడా బాగుండటం అసంతృప్తులు పార్టీని ఎంచుకోవడానికి ఒక కారణంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇదేదారిలో పయనించిన 24 మంది రాజకీయ నేతలు స్థానిక సంస్థల్లో విజయం సాధించి సింహం గుర్తుతో తమ సత్తా చాటుకున్నారు. అయితే, వీరంతా తరువాత అధికార పార్టీకి చేరువవుతుండటం గమనార్హం. ప్రస్తుతం రామగుండంలో కందుల సంధ్యారాణి, పెద్దపల్లిలో నల్ల మనోహర్ రెడ్డి సింహం గుర్తుపై పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని సమాచారం. వీరే కాక ఉమ్మడి జిల్లాలో పలు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్, బీజేపీ అసంతృప్తులు సైతం బీఎస్పీతోనూ టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

60 అసెంబ్లీ స్థానాల్లో పోటీ



క్రితంసారి రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 188 మంది మా పార్టీ నుంచి పోటీ చేయగా.. 92 మంది విజయం సాధించారు. ఈసారి ఉమ్మడి జిల్లాలో 13 స్థానాలు, రాష్ట్రవ్యాప్తంగా 60 స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాం. ఏఐఎఫ్‌బీ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భావజాలానికి, ఆయన సిద్ధాంతాలను అభిమానించే వారు, కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకత ఉన్న వారు మా పార్టీని తప్పకుండా ఆదరిస్తారు.
– జోజిరెడ్డి, ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏఐఎఫ్‌బీ గెలిచిన సీటు ఇదే..

రామగుండం అసెంబ్లీ: ఎమ్మెల్యే (తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు)

స్థానికసంస్థల్లో ఇలా..

- కరీంనగర్ కార్పొరేషన్‌లో 12 పోటీ మంది చేస్తే 3 సీట్లు దక్కించుకున్నారు. దాదాపుగా 12,700 ఓట్లు సాధించారు. అదేసమయంలో కాంగ్రెస్ 50 స్థానాల్లో పోటీ చేయగా.. 9,000కుపైగా ఓట్లు రావడం గమనార్హం.
- రామగుండంలో 14 స్థానాల్లో పోటీ చేయగా.. 9 మంది కార్పొరేటర్లు విజయం సాధించడం ఇక్కడ సింహం సింబల్‌కు ఉన్న ఆదరణకు నిదర్శనం.
- చొప్పదండిలో ఎంపీటీసీ స్థానం, పెద్దపల్లి 5 ఎంపీటీసీలు, మానకొండూరులో ఒకటి, రాయికల్‌లో ఒకటి, రామగుండంలో ఎంపీటీసీ మొత్తానికి 9 ఎంపీటీసీ స్థానాల్లో సింహం విజయం సాధించింది.
- చొప్పదండి మున్సిపల్‌లో ఒక కౌన్సిలర్, జగిత్యాలలో ఒక కౌన్సిలర్, పెద్దపల్లిలో ఒక కౌన్సిలర్ చొప్పున ముగ్గురు గెలిచారు.

బోణీ కోసం బీఎస్పీ తహతహ..

- 2004లో, 2014లో బీఎస్పీ తెలంగాణలో మంచిప్రభావమేచూపింది. 2014లో రెండు అసెంబ్లీ స్థానాలు గెలిచిన తరువాత తిరిగి ఆ స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. 2004లో కరీంనగర్ పార్లమెంటు నుంచి పోటీ చేసిన అభ్యర్థికి 43వేల ఓట్లు వచ్చాయి. 2006లో కోనరావుపేటలో ఐదు ఎంపీటీసీలు, సుల్తానాబాద్‌లో రెండు ఎంపీటీసీలు గెలుచుకుంది.



- 2021లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర పగ్గాలు చేపట్టిన తరువాత పార్టీ మునపటి కంటే ఆర్థికంగా బలపడిందన్న ధీమా కేడర్‌లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్దపల్లి అసెంబ్లీ బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష(ఐఐటీ– ఖరగ్‌పూర్) పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉంటూ, విజయంపై ధీమాగా ఉన్నారు. మిగిలిన స్థానాల్లోనూ నిశ్శబ్ద ఫలితాలు ఉంటాయని, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వం, ఆయనకు జిల్లాతో ఉన్న అనుబంధం తమకు కలిసి వస్తుందని నాయకులు ధీమాగా ఉన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇతర పార్టీల నుంచి అభ్యర్థులు వచ్చినా.. తమపార్టీ నిబంధనలకు కట్టుబడి ఉంటేనే టికెట్ ఇస్తామని నాయకులు స్పష్టంచేస్తున్నారు.

సిమ్స్‌లో టీచర్స్ డే



మాట్లాడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందసింగ్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో మంగళవారం టీచర్స్ డే వేడుక నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం ప్రాముఖ్యతపై కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్, ప్రొఫెసర్లు మాట్లాడారు. మెడికోల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ప్రొఫెసర్లు అరుణ, అనంతబాబు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెడికోలు పాల్గొన్నారు.

కుర్మకం భూములను సర్వే చేస్తాం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

రామగుండం: పరిశ్రమల స్థాపనకు ఐదు దశాబ్దాల క్రితం సేకరించిన కుర్సకం భూములు నిరుపయోగంగా ఉండడంతో సర్వే ప్రారంభిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ వెల్లడించారు. అంతర్గాం మండలం రాయదండి, పెద్దంపేట శివారులోని కుర్సకం భూములను ఉన్నతాధికారుల బృందంతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. 15 రోజుల్లో సర్వే చేయించి అర్హులకు అసైన్డ్ పట్టాల జారీకి కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. సర్వేలో రాజకీయ జోక్యం వద్దన్నారు. రెండు గ్రామాల శివారులో సుమారు వెయ్యి ఎకరాల భూములు ఉండడంతో ఐదు వందల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని రైతులు అంటున్నారు. సమావేశంలో ఆర్డీవో మదన్‌మోహన్, డీఐ గణపతి, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఐ రాజేందర్‌రెడ్డి, సర్పంచులు మేర్గు భాగ్యమ్మ, ధర్మాజి కృష్ణ, ఎంపీటీసీ కొలిపాక శరణ్య, జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఏడీ శ్రీనివాస్, శ్రీధర్ తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా, మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన వారిని కలెక్టరేట్‌లో డీఈవో మాధవి, అడిషనల్ కలెక్టర్లు శ్యాంప్రసాద్ లాల్, అరుణశ్రీ, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఓదెల మండలం ఓదెల, పిట్టలఎల్లయ్యపల్లె పాఠశాలలో పనిచేస్తున్న శారద, మాధవాచారి మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జూలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు) నుంచి జి.సునీత, కే.శ్రీనివాస్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల నుంచి ఎస్.ప్రదీప్‌కుమార్, వడ్కాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, మోడల్ స్కూల్ నుంచి టి.సంపత్ ఎంపికయ్యారు. రామగుండం మండలం పీకే.రామయ్య కాలనీ, ఆబాది రామగుండం, అక్బర్‌నగర్ ఉర్దూ మీడియం, అంతర్గాంలోని మర్రిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎండీ.వహీద్‌ఖాన్, దాసరి రఘుగౌడ్, పి.శ్రీనివాస్‌రావు, అయేషా తలత్, రఫత్‌ఉన్నీసాబేగం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఎలిగేడు మండలం ధూళికట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జి.వెంకట్‌రెడ్డి (ఎస్‌ఏ) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో హన్మంతు, రాంరెడ్డి, జ్యోత్స్నలత, షేక్, విజయ్‌కుమార్, మల్లేశ్, రవినందర్‌రావు, ఎంఈఓలు పాల్గొన్నారు.

టీచర్లు భవిష్యత్ మార్గనిర్దేశకులు :శ్రీధర్‌బాబు



పూలతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చందర్

మంథని: భవిష్యత్ మార్గనిర్దేశకులుగా ఉపాధ్యాయులని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా మంథనిలోని మైనార్టీ బాలికల, మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. మంథనిలోని రాధాకృష్ణ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ తాహెర్ హుస్సేన్‌ను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, సర్పంచ్ తిరుపతమ్మ సన్మానించారు. ఎక్లాస్‌పూర్ జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సంపత్‌రావు, బోనాల రవీందర్‌ను జెడ్పీటీసీ తగరం సుమలత సన్మానించారు.

టీచర్ల సంక్షేమానికి సీఎం కృషి: కోరుకంటి



సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

యైటింక్లయిన్‌కాలనీ: ఉపాధ్యాయుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కార్పొరేటర్ రాజ్‌కుమార్, ఆపిల్ కిడ్స్ పాఠశాల నిర్వాహకురాలు సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు బాధ్యతను పెంచింది



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులిగా ఎంపికవడం బాధ్యతను మరింత పెంచింది. గతంలో నిర్వహించిన జిల్లాస్థాయిమేళాలో నేను తయారు చేసిన టీఎల్‌ఎం రాష్ట్ర స్థాయి ఎంపికైంది. మంచి పౌరులను సమాజానికి అందించినప్పుడే ఉపాధ్యాయ వృత్తికి సార్థకత ఏర్పడుతుంది.
– వేల్పుల సంగీత, ఎస్జీటీ, ఉప్పట్ల, మంథని

రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న రాజు



రాజును సన్మానిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఓదెల: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తోట రాజుకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, హోంశాఖమంత్రి మహమూద్ అలీ, విద్యాసంచాలకులు దేవసేన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేశారు. అవార్డును తన తల్లితండ్రులకు అంకితం ఇస్తున్నట్లు రాజు తెలిపారు. రాజును సర్పంచు సామ మణెమ్మ, ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్, గ్రామస్తులు అభినందించారు.



ప్రకృతి ఒడిలో ఎన్టీపీసీ సోలార్ ప్లాంట్

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ రాజీవ్ రహదారి పక్కన నిర్మించిన 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ప్రకృతి పరిచిన పచ్చని చెట్ల మధ్య కనువిందు చేస్తోంది. దూరం నుంచి చూస్తే పలకలు నీటి జలాశయాన్ని తలపిస్తున్నాయి. ఆ సుందరదృశ్యం చూపరులను ఆకర్షిస్తోంది.

బసంత్‌నగర్‌లో హనుమాన్ శోభాయాత్ర



పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లో హనుమాన్ మాలధారులు సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయం ప్రాంగణంలో పూజారి సేనాపతి వెంకటరమణాచార్యులు యాత్రను ప్రారంభించారు. రాంనగర్, కృష్ణానగర్, సుభాష్‌నగర్, ఒడ్డెరకాలనీ, ఎల్, ఎం, ఈ, జే టైప్ క్వార్టర్లమీదుగా తిరిగి హన్‌మాన్ ఆలయానికి చేరుకుంది. భక్తులు నృత్యాలు చేస్తూ.. పాటలు పాడారు. కార్యక్రమంలో తోడేటి రవికుమార్, బత్తిని సతీశ్, తువ్వ రాజయ్య, కన్నం సంపత్, జట్‌పట్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుతో నవ సమాజ నిర్మాణం



మాట్లాడుతున్న ఆర్డీఓ హనుమనాయక్

మంథని: ఓటు హక్కు ద్వారానే నవ సమాజ నిర్మాణం జరుగుతుందని మంథని ఆర్డీఓ హనుమనాయక్ అన్నారు. మంథని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులతో దేశం అభివృద్ధి చెందితే ఓటర్లతో నవ సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దండిగ రాజయ్య, డీఏవో రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ ఠాకూర్, ప్రిన్సిపాల్ ఉష పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగరేణి స్థలాల్లో ఇళ్లకు పట్టాలు


పట్టాలు ఇస్తున్న జెడ్పీ చైర్మన్ మధు

రామగిరి: మండలంలోని వెంకట్రావ్‌పల్లి సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులకు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మంగళవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. జీవో 76 ద్వారా ఫేజ్–1లో దరఖాస్తు చేసుకున్న 74 మందికి సెంటనరీకాలనీ కమ్యూనిటీహాల్‌లో పట్టాలు అందజేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారికి పట్టాలు ఇస్తూ హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో హనుమానాయక్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ సభ్యురాలు మ్యాదరబోయిన శారద, తహసీల్దార్ రాంచందర్, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, సర్పంచ్‌లు పల్లె ప్రతిమ, పాశం ఓదెలు, ఎంపీవో కాటం భాస్కర్, అల్లం తిరుపతి, దామెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మల్యాల(చొప్పదండి): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలంలోని తక్కళ్లపల్లి కి చెందిన గొల్లపల్లి గణేశ్(21) మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ నెల 4న అర్ధరాత్రి ఉరేసుకొని, ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి వద్ద హుజూరాబాద్‌– కరీంనగర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడి కుటుంబ సభ్యులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి–ఇందిరానగర్ కాలనీకి చెందిన ఎర్ర లింగయ్య (48), ఆరెపల్లి సమ్మయ్య దినసరి కూలీలు. మంగళవారం ఉదయం ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై తుమ్మనపల్లి గ్రామంలో కూలీకి వెళ్తున్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వస్తున్న ఓ కారు ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఎర్ర లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరెపల్లి సమ్మయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమ్మయ్యను మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. లింగయ్యకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కోరుట్ల: స్థానిక పూల్‌వాగు వద్ద ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లపల్లి మండలానికి చెందిన స్వరూపకు కోరుట్ల మండలంలోని తిమ్మయ్యపల్లెకు చెందిన వ్యక్తితో వివాహమైంది. భర్తతో విభేదాలతో మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం సాయంత్రం పూల్‌వాగులో దూకేందుకు ప్రయత్నించగా అక్కడున్నవారు అడ్డుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి, బంధువులకు అప్పగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H.189329]

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా Work from Home సౌకర్యం కలదు. P/T: 8000/-,F/T:ఆకర్షణీయమైన జీతం8179175150 [G-10]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

వానలతో పంటలకు ఊపిరి

- మూడు రోజులుగా దంచికొడుతున్న వైనం
- నిండుకుండలా ప్రాజెక్టులు
- తెగుళ్లు దూరమవుతాయంటున్న రైతులు
- జిల్లాలో 2,01,408 ఎకరాల్లో వరి, 62,750 ఎకరాల్లో పత్తి సాగు


ఉధృతంగా ప్రవహిస్తున్న బొక్కలవాగు


నిండుకుండలా పార్వతీ బ్యారేజీ


మంథని శివారులో సాగు చేసిన వరి

మంథని: గత జూలైలో భారీ వర్షాలు, వరదల తర్వాత నెలపాటు వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు వాడిపోయాయి. ఈ క్రమంలో మూడు రోజుల నుంచి దంచికొడుతున్న వర్షాలు పంటలకు ఊపిరి పోశాయి. దీంతో వరిలో తెగుళ్లకు చెక్ పడటమే కాకుండా ఇసుక నేలల్లో వేసిన పత్తి పంటలకు ప్రయోజనం చేకూరింది. జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి, పార్వతీ బ్యారేజీల్లోకి భారీగా వరద వచ్చి, చేరుతుండటంతో నిండుకుండను తలపిస్తున్నాయి.

జిల్లాలో 14 మండలాలు..

పెద్దపల్లి జిల్లాలోని 14 మండలాల్లో ఈ సీజన్‌లో 2,01,408 ఎకరాల్లో వరి సాగు చేశారు. జూలైలో కురిసిన భారీ వర్షాలకు గోదావరి, మానేరు తీరం వెంట ఉన్న పంటలకు భారీగా నష్టం వాటిల్లగా పంపుసెట్లు కొట్టుకుపోయాయి. 20 రోజులుగా వర్షాలు జాడ లేకపోవడం, ఎండలు ఎక్కువ ఉండటంతో పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. పిలక దశలో ఉన్న పంటలకు నీటి తడి కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో తెగుళ్లకు చెక్ పడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరివైపు మళ్లిన అన్నదాతలు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత జిల్లాలో నీటి లభ్యత ఎక్కువైంది. దీంతో చాలా మంది రైతులు వరివైపు మళ్లారు. పత్తి సాగు కాస్త తగ్గినా జిల్లాలో ఈసారి 62,750 ఎకరాల్లో వేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పత్తి, వరి, ఇతర పంటలకు తాజా వర్షాలు మేలు చేస్తాయని రైతులు అంటున్నారు.

భారీగా వస్తున్న వరద నీరు

జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి, పార్వతి బ్యారేజీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్లంపల్లికి 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులను 30 గేట్లను ఎత్తి, 2,76,453 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. దీంతో మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీలోకి 3.10 లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా 74 గేట్లకు గాను 54 గేట్లను ఎత్తి, 3.25 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ సామర్థ్యం 130 మీటర్లు కాగా ప్రస్తుతం 126.75 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. అలాగే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.7584 టీఎంసీల నీరు ఉంది.

బొగ్గుబాయి వార్తలు

జీవితంలో గురువు పాత్ర కీలకం

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


టీచర్‌ను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: జీవితంలో గురువు పాత్ర కీలకమని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ–1 సింగరేణి హైస్కూల్‌లో టీచర్లను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో తల్లి, తండ్రి, గురువు, దైవాన్ని మర్చిపోకూడదన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది, లక్ష్యాల వైపు అడుగులు వేయించే బాధ్యత గురువులపై ఉంటుందని చెప్పారు. టీచర్లను గౌరవిస్తూ కష్టపడి చదివి, క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, దాని కోసం కష్టపడితే విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్.లక్ష్మీనారాయణ, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు స్వర్ణలత, కుమారస్వామి, శశికళ, పూర్ణచందర్, శ్రీలత, సుజాత, వీరస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణా వేగవంతం చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి డైరెక్టర్లు


మాట్లాడుతున్న ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: విద్యుత్ అవసరాల దృష్ట్యా వినియోగదారులకు బొగ్గు రవాణా వేగవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, కోల్ మూమెంట్ ఈడీ అల్విన్ స్పష్టం చేశారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీహెచ్‌పీలు, భారీ యంత్రాల పనితీరుపై సమీక్షించారు. అన్ని ఏరియాల నుంచి రవాణా అవుతున్న బొగ్గు రవాణా, బొగ్గు నాణ్యత తదితర విషయాలను వాకబు చేశారు. బొగ్గు అవసరాల దృష్ట్యా రేకుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైలు, రోడ్డు మార్గంలో రవాణా మరింత పెంచేలా చూడాలనీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని కోరారు. నిర్మాణంలో సీహెచ్‌పీ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ మాట్లాడుతూ ఓసీపీ–3 సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణా పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, డీజీఎం సివిల్ ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీక్రిష్ణ, ప్రాజెక్టు ఇంజినీర్ విజయ్‌కుమార్, సీహెచ్‌పీ ఇన్‌చార్జి సదానందం తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణా లక్ష్యాలు సాధించాల్సిందే..

- వీసీలో ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్


వీసీలో పాల్గొన్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: నిర్దేశిత బొగ్గు రవాణా లక్ష్యాలు సాధించాలని, అప్పుడే సింగరేణి లాభాల బాటలో పయనిస్తుందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సీహెచ్‌పీల పనితీరుపై సింగరేణి డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆర్జీ–1 సీఎస్పీ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఏరియాలోని అండర్ గ్రౌండ్, ఓసీపీ నుంచి సీఎస్పీకి బొగ్గు రవాణా వేగవంతం చేసేందుకు తగు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. లోడింగ్ పాయింట్‌ల నుంచి త్వరితగతిన బొగ్గు రవాణా జరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు రామ్మూర్తి, శ్రీనివాస్, శైలేంద్రకుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో ఉపాధ్యాయ దినోత్సవం


చైర్మన్ నరేందర్ రెడ్డిని సన్మానిస్తున్న టీచర్లు

సుల్తానాబాద్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం సుల్తానాబాద్‌లోని పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మన దేశ రాష్ట్రపతి అవడం రాజ్యాంగంతోనే సాధ్యమైందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే అవకాశం ఒక్క టీచర్‌కే ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించేందుకు టీచర్లు వారి విషయంలో కొంత కఠినంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. నైతిక విలువలతో కూడిన విద్యనందించాలని టీచర్లకు సూచించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.

తహసీల్‌కు రూ.89 వేల కరెంటు బిల్లు

- అవాక్కయిన తహసీల్దార్
- బకాయిలే రూ.82 వేలని చెప్పిన సిబ్బంది


కరెంటు బిల్లు చూపిస్తున్న తహసీల్దార్ యాకన్న

ఓదెల: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి కరెంటు బిల్లు రూ.89 వేలు రావడంతో తహసీల్దార్ యాకన్న అవాక్కయ్యారు. మంగళవారం విద్యుత్ శాఖ సిబ్బంది కార్యాలయానికి వచ్చి, బిల్లు రసీదు ఇవ్వటంతో తహసీల్దార్ ఆరా తీశారు. గత బకాయిలు రూ.82 వేలు కాగా, ఈ నెల వచ్చిన బిల్లు 7 వేలని సిబ్బంది తెలిపారు. నిత్యం భూముల రిజిస్ట్రేషన్, కంప్యూటర్ల వినియోగంతో కరెంటు బిల్లు ఎక్కువగా వస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం వస్తున్నప్పటికీ విద్యుత్ బిల్లుల మంజూరుపై అశ్రద్ధ చూపుతోందని పలువురు అంటున్నారు. బకాయిల చెల్లింపు కోసం రసీదును కలెక్టర్ కార్యాలయానికి పంపాలని తహసీల్దార్ సిబ్బందికి సూచించారు.

బురద రోడ్డుతో కార్మికుల ఇబ్బంది

- టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్


బురద రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

గోదావరిఖని: అధికారుల తీరుతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ ఆరోపించారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బేస్ వర్క్‌షాప్ టైర్ సెక్షన్‌లో ఓబీ మట్టి కొట్టుకువచ్చి, రోడ్డంతా బురదమయంగా మారిందన్నారు. ఈ మేరకు మంగళవారం బురద రోడ్డును పరిశీలించారు. ఓసీపీ–3 ప్రాజెక్టు విస్తరణలో భాగంగా భాగంగా బేస్ వర్క్‌షాప్, ఓల్డ్‌సైట్ ఆఫీస్‌ను కృషిభవన్ వద్దకు మార్చారని తెలిపారు. కానీ టైర్ సెక్షన్‌కి సంబంధించి షెడ్డు పనులు పూర్తి కాలేదన్నారు. దాన్ని మార్చకుండానే చుట్టూ ఓబీ మట్టి పోయించడం వల్ల వర్షాలకు కొట్టుకువచ్చి, రోడ్డుపై చేరుతోందన్నారు. ఇప్పటికైనా టైర్ సెక్షన్ ఇన్‌చార్జి, ప్రాజెక్టు అధికారి వెంటనే స్పందించి, కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు శంకర్‌నాయక్, కొంగర రవీందర్, అనిల్‌రెడ్డి, రాజయ్య, రాజేశం, వెంకట్రావ్ తదితరులున్నారు.

ఫ్రీక్వెన్సీ థెరపీ సెంటర్ ప్రారంభం


ప్రారంభిస్తున్న వైద్యుడు రవి నారాయణ

మంథని: మున్సిపల్ పరిధిలో రాఘవులు నగర్‌లో మంత్రపురి ఫ్రీక్వెన్సీ థెరపీ హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రముఖ వైద్యుడు, సీనియర్ ఫ్రీక్వెన్సీ థెరపిస్ట్ బి.రవి నారాయణ మంగళవారం ప్రారంభించారు. అనంతరం స్థానిక తమ్మి చెరువు కట్ట జానకీ రామ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో మాట్లాడారు. వ్యాధి ఏదైనా, అనారోగ్య లక్షణాలు ఏవైనా సైన్స్ ఆధ్యాత్మికతతో మిళితమై, అన్ని రకాల శారీరక, భావోద్వేగ రుగ్మతలను దూరం చేయడానికి హీలీ అనే వైద్య పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇది ప్రపంచంలోనే నంబర్ వన్ వెల్‌నెస్ పరికరమని తెలిపారు. ఫ్రీక్వెన్సీ థెరపీ ద్వారా చికిత్స అందించే విధానాన్ని వివరించారు. ఈ సెంటర్ ద్వారా అందించే ఉచిత సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెమినార్ నిర్వాహకులు ఇనుముల సతీశ్, ఉప్పట్ల శ్రీనివాస్, బడికెల నర్సయ్య, పి.శ్రవణ్, రావికంటి సతీశ్, ఎం.రవీందర్‌రావు, సిలివేరి కిషన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కబేలాలకు తరలిస్తున్న ఆవుల పట్టివేత

ధర్మారం: కబేలాలకు తరలిస్తున్న ఆవులను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంగళవారం వెల్గటూర్ మండలంలోని రాజారాంపల్లి వారసంత నుంచి ఇద్దరు వ్యక్తులు నాలుగు ఆవులు, రెండు దూడలను వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నారు. పత్తిపాక ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు వ్యాన్‌ను ఆపారు. లోపల చూడగా జీవాలు కనిపించాయి. వాటిని గోశాలకు తరలించి, సంబంధిత వ్యక్తులపై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'కొమురయ్య సేవలు మరువలేనివి'


నివాళి అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం కామ్రేడ్ కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన కార్మిక హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. యూనియన్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్.ప్రకాశ్, ఆర్జీ–2 బ్రాంచి ఇన్‌చార్జి రాజారత్నం, కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని: ఏఐటీయూసీ మాజీ ప్రధాన కార్యదర్శి మనోబోతుల కొమురయ్య 27వ వర్ధంతి స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో నిర్వహించారు. నాయకులు స్వామి, పోషం, అశోక్, మహేశ్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్ని గనులపై కొమురయ్య వర్ధంతి నిర్వహించారు.



పందిరిపై 'ముసుగు'

ముసురు కారణంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో చలి పెరిగింది.. అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టి చందంలా తయారైంది వర్షాల పరిస్థితి. మొన్నటివరకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు రెండు రోజులుగా కురుస్తున్న వానలు ఉపశమనం కలిగించాయి. అయితే, ఏకధాటిగా కురుస్తున్న వర్షం, చలికి కోళ్లు, పాడిపశువులు ఇబ్బంది పడుతున్నాయి. మంగళవారం పెద్దపల్లి శివారులో ఓ ఇంటి ఎదుట పందిరిపై కోళ్లు రెక్కలు కప్పుకొని, ముసుగు వేసుకున్నట్లు, వణుకుతూ 'సాక్షి' కెమెరాకు కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి


ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు దారిలో రోడ్డుపై వర్షపు నీరు


ఆర్టీసీ బస్టాండ్‌లో...


మత్తడి దూకుతున్న బందంపల్లి చెరువు


వర్షంలోనే వెళ్తున్న ప్రజలు


మంథనిలోని సత్యసాయినగర్‌లో ఓ ఇంట్లో చేరిన నీరు

అరగంట వర్షం.. మంథని ఆగమాగం

వర్షమంటేనే మంథని ప్రజల్లో వణుకు పుడుతోంది. గోదావరి, మానేరు తీరం వెంట ఉన్న పంట పొలాలు, ఇళ్లలోకి నీరు చేరి మూడేళ్లుగా డివిజన్ రైతులు, ప్రజలు నష్టపోతూనే ఉన్నారు. గతేడాది మంథనిలోని బొక్కలవాగు బ్యాక్‌వాటర్‌లో పట్టణం నీట మునిగి ప్రజలు లక్షల్లో నష్టం చవిచూశారు. మంగళవారం మధ్యాహ్నం అరగంటపాటు కుండపోత కురిసిన వర్షానికి పట్టణంలోని సత్యసాయినగర్, పద్మశాలివీధి, బస్టాండ్ ఏరియాలో మోకాళ్లోతు నీరు పారింది. పలు ఇళ్లలోకి నీరు చేరింది.

– మంథని